సాక్షి జనగామ

ఆదివారం | 13 | ఆగస్టు | 2023



ప్రయాణికులకు గుడ్‌న్యూస్..

ఆర్టీసీ బస్సుల్లో జీపీఎస్ ట్రాకింగ్ సిస్టంను ఏర్పాటు చేశారు. 'గమ్యం' యాప్‌తో బస్సు ఎక్కడుందో తెలుసుకోవచ్చు. - 8లో▸



బాలుడి ప్రాణం తీసిన నిద్ర

అనారోగ్యంతో బాధపడుతున్న నానమ్మను చూసేందుకు తల్లిదండ్రులతో కలిసి ఆటోలో వెళ్తున్న ఓ బాలుడు ఆటోలోంచి పడి మృతిచెందాడు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$32^0/25^0$

వాతావరణం

ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉండి, సాయంత్రం ఆహ్లాదకరంగా మారుతుంది.

న్యూస్‌రీల్

జనగామలో రేపు నీటి సరఫరా బంద్



జనగామ: జనగామ పట్టణం సబ్ జైలు వద్ద షామీర్‌పేట ఏరియాకు పంపింగ్ చేసే మిషన్ భగీరథ పైపులైన్‌కు ఇంటర్ కనెక్షన్ ఇవ్వనున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 14న పట్టణంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి నీటి సరఫరా నిలిపి వేస్తున్నట్లు కమిషనర్ రజిత శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిద్దిపేట రోడ్డు, అయ్యప్ప స్వామి టెంపుల్ (బాణాపురం ఏరియా), రిజిస్ట్రేషన్, తహసీల్ ఆఫీస్, లక్ష్మీభాయి కుంట, గ్రేయిన్ మార్కెట్ (చీటకోడూరు రోడ్డు), గీతానగర్, వికాస్ నగర్, అరవింద నగర్ ఏరియాల్లో తాగునీటి సరఫరా నిలిచిపోనుందని ఆమె ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన 'కొమ్మూరి'



జనగామ: జనగామ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి శనివారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసారు. డీసీసీ అధ్యక్షుడిగా నియామకమైన తర్వాత ఆయన మొదటి సారిగా రేవంత్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈసందర్భంగా జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేయాలని రేవంత్‌రెడ్డి సూచించినట్లు ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

ఉత్తమ దర్యాప్తు అధికారిగా జితేందర్‌రెడ్డి



వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ఎస్‌బీ ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న ఎం.జితేందర్‌రెడ్డి కేంద్ర హోమ్ మినిస్టర్స్ ఉత్తమ దర్యాప్తు అధికారిగా ఎంపికయ్యారు. 2020లో హనుమకొండ ఏసీపీగా విధులు నిర్వహించే సమయంలో హనుమకొండ రాంనగర్ ప్రాంతంలో ఓ యువతిపై అత్యాచారం, హత్య జరిగింది. ఈ కేసులో ఉత్తమంగా దర్యాప్తు చేయడంతో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష పడింది. ఇందుకుగాను 2023 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం జితేందర్‌రెడ్డికి యూనియన్ హోమ్ మినిస్టర్స్ ఉత్తమ దర్యాప్తు అధికారిగా అవార్డు కు ఎంపిక చేసింది. ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. అవార్డుకు ఎంపికైన జితేందర్‌రెడ్డిని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్‌తో పాటు డీసీపీ పోలీస్ అధికారులు సిబ్బంది అభినందనలు తెలిపారు.



పర్యాటకుల సందడి

ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని చీకుపల్లి గ్రామ సమీపంలో ఉన్న బొగత జలపాతం వద్ద శనివారం పర్యాటకుల సందడి నెలకొంది. బొగత జలపాతం అందాలను చూసేందుకు వచ్చిన పర్యాటకులు నీటి కొలనులో స్నానాలు చేశారు. సెల్ఫీలు దిగుతూ ఆనందంగా గడిపారు.

– వాజేడు

ఫైవ్ ప్లస్ వన్

శిక్షణలో మాట్లాడుతున్న డీఈఓ రాము



నూతన విధానంలో విద్యాబోధన

- ఐదు రోజులు పాఠాలు.. ఒక రోజు వర్క్‌బుక్ పూర్తి
- ఉపాధ్యాయులకు శిక్షణ

ఈనెల నుంచే..

'ఫైవ్ ప్లస్ వన్' విధానాన్ని ఈవిద్యాసంవత్సరం నుంచే అమలు చేయనున్నారు. ఇందుకు రాష్ట్ర వ్యాప్తంగా తెలుగు, ఇంగ్లిష్, గణితం పాఠ్యాంశాల్లో అనుసరించాల్సిన విధానాలపై జిల్లాలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. వంతుల వారీగా శిక్షణ అనంతరం ఈనెలలో జరిగే వారోత్సవాల సందర్భంగా లాంఛనంగా కార్యక్రమాన్ని ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు.

జనగామ రూరల్: పాఠశాలల విద్యార్థులకు నూతన విధానంలో బోధించేందుకు ప్రణాళికలు రూపొందుతున్నాయి. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ప్రాంభించిన ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమం విజయవంతమైంది. విద్యార్థులకు గతంలో 2 ఎఫ్‌ఏలు, 4 ఎస్‌ఏ పరీక్షలు నిర్వంహించే వారు తద్వారా చాలా రోజుల క్రితం చదివిన పాఠాలు జ్ఞాపకం పెట్టుకుని విద్యార్థులు సమాధానాలు రాయాల్సి ఉండేది. ఇది కాస్త కష్టతరమైన విధానం. ఈనేపథ్యంలో ప్రభుత్వం 'ఫైవ్ ప్లస్ వన్' విధానాన్ని అమలు చేయాలని యోచిస్తుంది. ఈ విధానంలో ఉపాధ్యాయులు తమకు ఇచ్చిన లెసన్ ప్లాన్ ప్రకారం వారంలో ఐదు రోజులు పాఠాలు బోధించాలి. ఆరో రోజు విద్యార్థులు వర్క్ బుక్‌లోని సంబంధిత పాఠ్యాంశానికి సంబంధించి అదనపు సమాచారం తప్పనిసరిగా పూర్తి చేయాల్సి ఉంటుంది.


వర్క్ పుస్తకాలతో పాఠ్యాంశాలపై పట్టు

పాఠ్యాంశాలపై పూర్తి సామర్థ్యాలు, పట్టు ఉండేలా ప్రభుత్వం 1నుంచి 5వ తరగతి విద్యార్థులకు వర్క్ పుస్తకం అందజేస్తుంది. అయితే ప్రస్తుతం అమలులో ఉన్న 220 పని దినాలను సరళీకరించి పాఠాల బోధనకు 140రోజులు సరిపోతాయన్న నిపుణుల సూచన మేరకు వర్క్ బుక్ రూపొందించినట్లు సమాచారం. 1నుంచి 5 తరగతి విద్యార్థులు ఇంగ్లిష్, తెలుగు, గణితంపై ఎక్కువ పట్టు సాధించేలా వర్క్ బుక్‌లో పాఠానికి సంబంధించిన అభ్యాసాలు ఉంటాయి. వర్క్ బుక్‌లో తప్పులు దొర్లకుండా 1, 2 తరగతి విద్యార్థులు పెన్సిల్‌ను 3, 4, 5 తరగతుల వారు పెన్‌తో సమాధానాలు రాయాలని సూచించారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

నూతన బోధన విధానాన్ని అన్ని పాఠశాల్లో ప్రాథమిక స్థాయిలో అమలు చేయాడానికి రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల నుంచి ఉపాధ్యాయలను ఎంపిక చేసి హైదరాబాద్‌లో దీనిపై శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ పొందిన వారు జిల్లా స్థాయిలో అన్ని పాఠశాల ఉపాధ్యాయలకు శిక్షణ అందిస్తున్నారు. వర్క్ బుక్‌లో విద్యార్థుల సామర్థ్యాలు ఎలా మెరుగుపర్చాలో తగు విధానాలు, ఎలా నమోదు చేయాలో వివరిస్తున్నారు. పాఠం పూర్తి చేసిన తర్వాత వర్క్ బుక్‌లో తప్పనిసరిగా ఉపాధ్యాయుడు సంతకం చేయాల్సి ఉంటుంది.

తరగతి గదిలో విద్యార్థులు 80 శాతం ప్రతిభ చూపిస్తేనే మరో పాఠానికి వెళ్లాల్సి ఉంటుంది. పాఠ్యాంశం 10 రోజులు ఉంటే మొదటి ఐదు రోజులు చెప్పి ఆరో రోజు వర్క్ బుక్‌లో మూల్యాంకనం చేయించాల్సి ఉంటుంది.



విద్యార్థులకు అందజేయనున్న వర్క్ బుక్

విద్యార్థులకు ఉపయోగకరం



అభ్యసన, పాఠ్యాంశంపై విద్యార్థులు పట్టు సాధించి పరీక్షల్లో ఎలాంటి సమస్యలు లేకుండా ఉండేందుకు నూతన విధానం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఉపాధ్యాయులు విధిగా శిక్షణ తీసుకుని పాఠాలు బోధించేందుకు అవకాశం. ఉపాధ్యాయులకు శిక్షణ జరుగుతుంది. ఈనెలలో వర్క్‌బుక్ ద్వారా బోధన అందించడానికి కృషి చేస్తున్నాం.

– బొమ్మర శ్రీనివాస్, సెక్టోరియల్ అధికారి

నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

- సాక్షి కథనానికి స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు

సాక్షి స్పందన



విద్యుత్‌శాఖ అధికారులతో రైతులు

స్టేషన్‌ఘన్‌పూర్: నియోజకవర్గంలోని రఘునాథపల్లి మండలం కుర్చపల్లి, అయ్యవారిగూడెం శివారులోని తమ వ్యవసాయ భూముల వద్ద ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయినా ఘన్‌పూర్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రం అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదంటూ బాధిత రైతులు పురుగుల మందు డబ్బాతో నిరసన తెలిపిన విషయమై 'టాన్స్‌ఫార్మర్ కాలిపోయి వారం' అనే శీర్షికన సాక్షి దినపత్రికలో శనివారం వార్త ప్రచురితమైంది. దీంతో సంబంధిత అధికారులు స్పందించారు. ట్రాన్స్‌కో డీఈ హుస్సేన్‌నాయక్ ఆదేశాల మేరకు ఏడీఈ సత్యనారాయణ, ఏఈ పులిచంద్రమోహన్, లైన్‌మన్ యుగేందర్ అయ్యవారిగూడెం శివారు బాధిత రైతుల వ్యవసాయ భూమి వద్ద నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. అదేవిధంగా స్వయంగా డీఈ ప్రత్యేక చొరవతో ఎస్‌ఈ వేణుమాధవ్‌తో మాట్లాడి మరొక అదనపు ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ రైతులు ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని, ఎలాంటి ఆవేశాలకు గురికావొద్దన్నారు. కార్యక్రమంలో ఏడీఈ సత్యనారాయణ, ఏఈ పులి చంద్రమోహన్, లైన్‌మన్ యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని ఓడించేందుకు ఏకం కావాలి

- మాజీ ఎమ్మెల్యే రాజారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాజారెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్: కేంద్రంలో అధికారంలో ఉన్న మతతత్వ బీజేపీ పార్టీని రానున్న ఎన్నికల్లో చిత్తుగా ఓడించేందుకు లౌకిక శక్తులు ఏకం కావాలని మాజీ ఎమ్మెల్యే, సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.రాజారెడ్డి అన్నారు. డివిజన్ కేంద్రంలోని ముదిరాజ్ కమ్యూనిటీ హాల్‌లో సీపీఐ నియోజకవర్గస్థాయి సమావేశాన్ని శనివారం నిర్వహించారు. సీపీఐ మండల కార్యదర్శి తోట రమేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా రాజారెడ్డి హాజరైన మాట్లాడారు. దేశంలో డబుల్ ఇంజన్ సర్కార్ ఉన్న చోట మహిళలకు రక్షణ కరువైందని, ఆర్‌ఎస్‌ఎస్ గుండాలు పట్టపగలే మహిళలపై అత్యాచారాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మణిపూర్ బీజేపీ ఆర్ఎస్ఎస్ గుండాల చేతిలో మండిపోతుంటే ప్రధాని నరేంద్రమోదీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రానున్న ఎన్నికల్లో గెలుస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా గుజరాత్ దొంగలకు కట్టబెట్టి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న బీజేపీని ఓడించడం కోసం దేశంలో ఉన్న లౌకిక శక్తులన్నీ ఏకం కావాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మంగళంపల్లి జనార్దన్, నియోజకవర్గ కార్యదర్శి జువారి రమేష్, భిక్షపతి, యాదగిరి, రాములు, సదానందం, రత్నం, సమ్మయ్య, కుమార్, ప్రభాకర్ పాల్గొన్నారు.

పోస్టాఫీస్‌లో ఆధార్ కేంద్రం

జనగామ రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రధాన పోస్టాఫీస్‌లో ఆధార్ కేంద్రాన్ని అసిస్టెంట్ సూపరింటెండెంట్ మూల రమాదేవి శనివారం పుర:ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆధార్ అప్లికేషన్, ఎన్‌రోల్‌మెంట్ సంబంధిత అన్ని రకాల సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో హెడ్ పోస్ట్ మాస్టర్ బ్రహ్మేశ్వర్‌సింగ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

- ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

జనగామ రూరల్: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని గానుగుపహడ్ గ్రామంలో ముదిరాజ్ కమిటీ హాల్, మహిళా పొదుపు సంఘం భవన నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నామన్నారు. తెలంగాణలో పాలనను చూసి ఓర్వలేక కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉచితాలు బంద్ చేయాలని అంటుందని పేర్కొన్నారు. గ్రామంలో ఇప్పటి వరకు రూ.65 లక్షలతో సీసీ రోడ్డు, పలు అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్దె సిద్దిలింగం, జెడ్పీటీసీ నిమ్మతి దీపిక మహేందర్‌రెడ్డి, రైతు సమన్వయ మండల అధ్యక్షుడు భూరెడ్డిప్రమోద్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు యాదగిరి, సర్పంచ్ శానబోయిన శ్రీనివాస్, ఎల్లయ్య పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

- యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో ర్యాలీ, కలెక్టరేట్ ఎదుట నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

జనగామ: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్‌ను అమలు చేయాలని యూపీఎస్‌సీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు, టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వై.అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ, యూఎస్‌సీ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి, నిరసన తెలిపారు. సంఘ కమిటీ బాధ్యులు బి.లక్ష్మయ్య, పి.చంద్రశేఖర్‌రావు, చాడ రవి, పి.యాదగిరి అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సీపీఎస్ రద్దు చేయడంతో పాటు పీఆర్‌సీ కమిటీ వేసి, ఐఆర్ ప్రకటించాలన్నారు. ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలు నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లు, డీఏలు వెంటనే ఇవ్వాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులపై వివక్షత చూపిస్తుందన్నారు. పాఠశాల విద్యలో కేవలం 1,002 గురుకులాలు స్థాపించి, నాణ్యమైన విద్యను అందిస్తే, మిగతా 20 లక్షల మంది విద్యార్థులు చదువుకునే పంచాయతీరాజ్, ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల పిల్లల పరిస్థితి ఏంటన్నారు. సర్కారు బడుల్లో 20వేల వరకు ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నప్పటికీ భర్తీ చేయకుండా, మెరుగైన విద్యను పేదలకు అందకుండా చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం యూఎస్‌పీసీ రాష్ట్ర బాధ్యుడు డి.శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ జ్వాల సంపాదకవర్గ సభ్యురాలు జి.కళావతి, నాయకులు ఎస్ ఎస్ రాజు, ఆకుల శ్రీనివాస్, చొక్కయ్య, ఎస్.సత్తయ్య, అశోక్, శ్రీరామ్, వజ్రయ్య, సత్యనారాయణరెడ్డి, వెంకన్న, కృష్ణ, నర్సింహులు, నాగేందర్, వెంకటేష్, శ్రీనివాస్, బాబయ్య, గణేష్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులపై ప్రభుత్వం వివక్ష

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి



మాట్లాడుతున్న దశమంతరెడ్డి

జనగామ: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులపై వివక్ష చూపిస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ చౌరస్తాలో ఉద్యోగ అవకాశాలు, నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు శానబోయిన మహిపాల్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేయగా, పోలీసులు అడ్డుకునే ప్రయత్నంలో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం దశమంతరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మరిచిపోయారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 56 నెలల కాలానికి గాను నిరుద్యోగులకు రావాల్సిన భృతి రూ.ఒకలక్ష 76వేలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బేజాటి బీరప్ప, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బల్లా శ్రీనివాస్, నాయకులు ఉడుగుల రమేష్, శివరాజ్ యాదవ్, శరత్, గణపురం కార్తీక్, నటరాజ్, అంజి, నరేష్ వీరకుమార్, జంపన్న, శ్రీకాంత్, కర్ణాకర్, నవీన్, విజయ్, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జనగామ రూరల్: జిల్లాలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జ్ డీఐఈఓ ఆంజనేయ రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో సీజీటీ ఒకేషన్‌లో పోస్టు ఖాళీ ఉందని ఎంఎస్సీ టెక్స్‌టైల్స్ అండ్ క్లాథింగ్ హోమ్ సైన్స్ చేసినవారు అర్హులని తెలిపారు. సంబంధిత ధ్రువపత్రాలతో కలెక్టరేట్‌లోని రెండో అంతస్తు రూం నంబర్ 20లోని డీఐఈఓ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

కౌన్సెలింగ్

జనగామ రూరల్: జూలైలో కేజీబీవీ, యూఆర్‌ఎస్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న వివిధ రకాల పోస్టులకు పరీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 42 పోస్టులకు 126మంది అర్హత సాధించగా శనివారం 1:1 అభ్యర్థుల జాబితాను డీఈఓ రాము విడుదల చేశారు. మెరిట్ లిస్టును www.deojangaon.comలో పొందుపర్చారు. ఎంపికైన అభ్యర్థులు ఆదివారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని విద్యాశాఖ కార్యాలయం ఎఫ్ 27లో నిర్వహించే కౌన్సెలింగ్‌కు తమ ఒరిజనల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు ఉత్తమ అవార్డు



అవార్డు అందుకుంటున్న రాధికరాణి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ బి.రాధికరాణి శనివారం మద్రాస్‌లో ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకున్నారు. గ్రంథాలయ పితామహుడు పద్మశ్రీ, డాక్టర్ ఎస్ఆర్.రంగనాథన్ 131వ జయంతి సందర్భంగా మద్రాస్ లైబ్రరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మద్రాస్‌లో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో ఆమె అవార్డు స్వీకరించారు. లైబ్రరీ సైన్స్‌లో విద్యాబోధన, పరిశోధనల పరంగా అందిస్తున్న ఉత్తమ సేవలను గుర్తించి మద్రాస్ లైబ్రరీ అసోసియేషన్ కేయూ లైబ్రరీ సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆ విభాగాధిపతి డాక్టర్ బి.రాధికారాణిని అవార్డుకు ఎంపిక చేసింది. లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగం రిటైర్డ్ ఆచార్యులు మనోరమ శ్రీనాథ్, మద్రాస్ లైబ్రరీ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ డాక్టర్ కె.నిత్యానందం చేతుల మీదుగా ఆమె అవార్డు అందుకున్నారు.

వైభవంగా వారకల్యాణం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

చిల్పూరు: శ్రీబుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో శనివారం వైభవంగా అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు వార కల్యానం నిర్వహించారు. భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన సామ వెంకట్‌రెడ్డి–శ్రీలత, విష్ణువర్ధన్‌రెడ్డిలు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నకిలీ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్

- పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు

హసన్‌పర్తి: నకిలీ డాక్యుమెంట్లతో కొందరు వ్యక్తులు తన భూమిని రిజిస్ట్రేషన్ చేశారని బాధితురాలు వైజయంతి తెలిపింది. ఈ మేరకు శనివారం హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. హన్మకొండ అడ్వకేట్ కాలనీకి చెందిన జగతిరావు 1986లో ఏనుగుల సుజాత బాయి, పావుశెట్టి ఆగయ్య వద్ద ఎనిమిది వందల గజాల భూమిని కొనుగోలు చేశారు. ఆ భూమిని జగతిరావు తన కూతురు వైజయంతి పేర సేల్ డీడ్ చేశాడు. ఇందులో నుంచి నాలుగు వందల గజాల భూమిని వైజయంతి తన సోదరి రామవరపు లక్ష్మి పేర రిజిస్ట్రేషన్ చేసింది. ఈ ఎనిమిది వందల గజాల భూమిని భీమారానికి చెందిన భాగ్యరాజ్ నకిలీ డాక్యుమెంట్లు తయారు చేసి విక్రయించారని వైజయంతి తెలిపింది. ఇందుకు కె.సత్యం, రాజేశ్వర్‌శర్మతో మరో ఇద్దరు సహకరించారని ఆమె వివరించింది. ఇందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని వైజయంతి కోరింది. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గోపీ తెలిపారు.

ప్రైవేట్ బ్యాంకులో ఘరానా మోసం..

- ఫండ్స్‌ను దారిమళ్లించిన డిప్యూటీ మేనేజర్
- అదుపులోకి తీసుకున్న పోలీసులు.. కేసు నమోదు

నర్సంపేట రూరల్ : ప్రైవేట్ బ్యాంకు డిప్యూటీ మేనేజర్ ఘరానా మోసం చేసి ఫండ్స్‌ను పక్కదారి పట్టించారు. ఈ ఘటన నర్సంపేట పట్టణంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ప్రధాన రహదారిపై ఓ ప్రైవేట్ బ్యాంకు కొనసాగుతోంది. ఇక్కడ డిప్యూటీ మేనేజర్ తన వక్రబుద్ధి ప్రదర్శించారు. బ్యాంకు ఫండ్స్ దారి మళ్లించారు. తప్పుడు డ్యాక్‌మెంట్స్ సృష్టించి లోన్స్ ఇచ్చినట్లు రికార్డులు తారుమారు చేశారు. దీనిపై ఉన్నతాధికారులకు అనుమానం వచ్చి పరిశీలించగా, రికార్డులు, నగదు, బంగారం తదితర అంశాల్లో పూర్తిగా వ్యత్యాసం కనిపించింది. డిప్యూటీ మేనేజర్‌పై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీంతో పోలీసులు డిప్యూటీ మేనేజర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయన ఇంట్లో సోదాలు నిర్వహించి విలువైన పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. కాగా, ఈ ఘనటపై ఎస్సై రవిని వివరణ కోరగా బ్యాంక్‌లో జరిగిన అవకతవకలపై సంబంధిత ఉన్నతాధికారులు ఫిర్యాదు చేయగా డిప్యూటీ మేనేజర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



'క్యాసినో' కోసం కన్నం..

- ఆన్‌లైన్ గేమ్‌లో డబ్బు పోగొట్టుకున్న విద్యార్థి
- ఎలాగైనా సంపాదించాలని చోరీకి నిర్ణయం
- ఐనవోలు, బొల్లికుంటలో దొంగతనాలు
- విద్యార్థితోపాటు స్నేహితుడి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఈస్ట్‌జోన్ డీసీపీ


మామునూరు : నిందితుల అరెస్ట్ చూపుతున్న డీసీపీ రవీందర్ యాదవ్, ఏసీపీ సతీష్‌బాబు

మామునూరు: ఓ విద్యార్థి ఆన్‌లైన్ గేమ్ 'క్యాసినో'కు అలవాటు పడ్డాడు. ఆ గేమ్‌లో భారీగా నగదు పోగొట్టుకున్నాడు. చేసిన అప్పు తీర్చాలి. పోయిన డబ్బు ఎలాగైనా సంపాదించాలనుకున్నాడు. దీనికి చోరీలే మార్గమనుకున్నాడు. ఇంకేముందు తాళం వేసిన ఇళ్లకు కన్నం వేయడం మొదలుపెట్టాడు. చోరీ చేసిన డబ్బుతో ఆన్‌లైన్ గేమ్ ఆడుతూ జల్సాలు చేస్తున్నాడు. ఇలా చోరీలకు పాల్పడుతున్న ఓ విద్యార్థితోపాటు అతడికి సహకరించిన స్నేహితుడు శనివారం ఐనవోలు పోలీసుల చేతికి చిక్కగా వారి వద్ద నుంచి బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు శనివారం సాయంత్రం మామునూరు ఏసీపీ కార్యాలయంలో వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ యాదవ్ వివరాలు వెల్లడించారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం దమ్మన్నపేటకు చెందిన విద్యార్థి టెల్లి సందీప్ ఆన్‌లైన్ గేమ్ 'క్యాసినో'కు అలవాటు పడ్డాడు. ఈ గేమ్ కోసం అప్పు చేశారు. అనంతరం ఆడగా డబ్బు మొత్తం పోగొట్టుకున్నాడు. దీంతో అప్పు తీర్చేందుకు చోరీలు చేయాలని నిశ్చయించుకున్నాడు. తాళం వేసిన ఇళ్లల్లో చోరీలు చేయడం మొదలెట్టాడు. ఈ క్రమంలో గతనెల 23న ఐనవోలు మండల కేంద్రంలో పల్లకొండ రాజేష్ ఇంట్లో చోరీకి పాల్పడి రూ.80వేల నగదు, బంగారం, వెండి ఆభరణాలను అపహరించాడు. చోరీ చేసిన డబ్బు నుంచి రూ.60 వేలతో ఓ బైక్, రూ.30వేలతో ఫోన్ కొనుగోలు చేశాడు. అనంతరం జూలై 24న ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట గ్రామంలో అడ్డ గట్ల ఎల్ల య్య ఇంట్లోకి చోరీకి పాల్పడ్డాడు. రూ.2వేల నగదుతోపాటు 2తులాల బంగారం, వెండి ఆభరణాలు అపహరించాడు. చోరీ చేసిన నగదు నుంచి రూ.2వేలు ఖర్చు చేశాడు. అనంతరం చోరీ చేసిన బంగారు, వెండి ఆభరణాలను తన స్నేహితుడు జనగామ జిల్లా పెద్దపహాడ్ గ్రామానికి చెందిన భూక్య సంపత్ వద్ద భద్రపర్చాడు. ఈ క్రమంలో శని వారం ఐనవోలు మండలం పున్నేలు గ్రామంలో వా హన తనిఖీలు చేస్తున్న ఎస్సై నవీన్‌కుమార్.. అనుమానాస్పందగా కనిపించిన సందీప్‌ను అదుపులోకి తీసుకున్నాడు. విచారించగా చోరీలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకున్న సందీప్.. ఆ డబ్బును తన స్నేహితుడు భూక్య సంపత్ వద్ద దాచిపెట్టినట్లు తెలిపాడు. దీంతో సందీప్‌తోపాటు సంపత్‌ను అరెస్ట్ చేసి వారి వద్ద ఉన్న బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ తెలిపారు. తల్లిదండ్రులకు తమ పిల్లలపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని మొబైల్ గేమ్స్ ఆడకుండా చూడాలని డీసీపీ సూచించారు. సమావేశంలో మామునూరు ఏసీపీ సతీష్ బాబు, మామునూరు, వర్ధన్నపేట సీఐలు క్రాంతికుమార్, శ్రీనివాస్, ఎస్సైలు కృష్ణవేణి, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాల దొంగల అరెస్టు..

వరంగల్ క్రైం : వరంగల్ పోలీస్ కమిషనరేట్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో బైక్‌లు, తాళం వేసి ఉన్న షట్టర్లల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను సీసీఎస్, మట్టెవాడ, సుబేదారి పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేసినట్లు క్రైం ఏసీపీ మల్లయ్య శనివారం తెలిపారు. నిందితుల నుంచి సుమారు రూ.6లక్షల విలువైన తొమ్మిది బైక్‌లు, రూ.1.60 లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. వరంగల్ పోచమ్మమైదాన్ చెందిన బరిపట్ల సాయి వరంగల్ కమిషనరేట్ తోపాటు మహబూబాబాద్ జిల్లాలో చోరీలకు పాలప్తుండగా పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు. గత జూన్‌లో జైలు నుంచి విడుదలైన సాయి మరోమారు చోరీలకు పాల్పడుతుండగా పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ఘటనలో హనుమకొండ దీన్ దయాల్ కాలనీ చెందిన బూకరాజు సందీప్ వరంగల్ కమిషనరేట్ పరిధితో పాటు కరీంనగర్, ఖమ్మం ప్రాంతాల్లో ద్విచక్రవాహనాలు చోరీలకు పాల్పడుతుండగా పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు. గత మే నెలలో ఖమ్మం జైలు నుంచి విడుదలైన సందీప్ మరోమారు వరంగల్ ,హైదరాబాద్‌లో తాళం వెసిన షట్టర్లు, ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడ్డాడు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు పక్కా సమాచారంతో నిందితులను పట్టుకున్నారు. వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వీరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విచారించగా తమ నేరాలను అంగీకరించారు. వీరి సమాచారంలో మిగతా ద్విచక్రవాహనాలు, నగదుతో పాటు ఇతర చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు క్రైమ్ ఏసీపీ తెలిపారు.


వరంగల్ క్రైం: నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


సింగరి రవి (ఫైల్)

టేకుమట్ల(రేగొండ): అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం కోటంచలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కోటంచ గ్రామానికి చెందిన సింగరి రవి(48) తనకున్న రెండెకరాల భూమిలో వివిధ పంటలను సాగు చేసుకుంటున్నాడు. గత సంవత్సరం పంటలు పండకపోవడంతో పాటు, ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. గతంలో చేసిన సుమారు రూ.5లక్షల మేర అప్పులు ఎలా తీర్చాలన్న బాధతో తీవ్ర మనస్తాపానికి గురై ఈ నెల 10న తెల్లవారుజామున ఇంట్లోని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం చిట్యాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు తెలిపారు. కాగా మృతుడి కుమారుడు రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

16న ఎస్‌వీఎస్‌లో ప్లేస్‌మెంట్

హసన్‌పర్తి: భీమారంలోని ఎస్‌వీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 16న ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు తెలిపారు. క్యాప్ జెమిని, డిలైట్, ఏడీపీ, జేపీ మార్గోన్ కంపెనీలను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఇంజనీరింగ్, ఏదైనా డిగ్రీలో 50శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు ఇంటర్వ్యూలకు అర్హులన్నారు. 2020-2021, 2021-2022 2022- 2023 విద్యాసంవత్సరాల్లో డిగ్రీ చదివిన వారు ప్లేస్‌మెంట్‌కు హాజరుకావాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 16వ తేదీ ఉదయం 9 గంటల లోపు ఒరిజినల్ సర్టిఫికెట్లతో రావాలన్నారు. ఉద్యోగానికి ఎంపికైన వారికి ఏడాదికి రూ.3 నుంచి రూ.8లక్షల వరకు వేతనం ఉంటుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం


పిచ్చయ్య (ఫైల్)

దేవరుప్పుల : జనగామ–సూర్యాపేట రహదారిపై కామారెడ్డిగూడెం స్టేజీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు దుర్మరణం చెందాడు. మండంలోని కామారెడ్డిగూడేనికి చెందిన మరిపెల్లి పిచ్చయ్య (70) శనివారం ఉదయం అంబేడ్కర్ విగ్రహం నుంచి షేక్‌బందగీ స్తూపం వైపునకు రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో జనగామ నుంచి సూర్యాపేట వైపునకు వెళ్తున్న టాటా ఏస్ వాహనం ఢీకొనగా తీవ్రగాయాలపాలయ్యాడు. వెంటనే చికిత్స నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె శ్రవణ్‌కుమార్ పేర్కొన్నారు.

చికిత్స పొందుతున్న రైతు మృతి

కాటారం: భారీ వర్షాలు, అన్నారం బ్యారేజీ బ్యాక్ వాటర్‌తో పంట నీట మునగడంతో అప్పుల పాలై ఆత్మహత్యకు యత్నించిన ఓ రైతు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం మండలం దామెరకుంటకు చెందిన అడుగూరి విశ్వనాథం(50) తనకు ఉన్న రెండెకరాల భూమితో పాటు ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేస్తున్నాడు. గతేడాది పంట సాగు కోసం రూ.5లక్షల మేర అప్పు చేశాడు. భారీ వర్షాలతో అన్నారం బ్యారేజీ బ్యాక్ వాటర్ రావడంతో పంట పూర్తిగా నీటమునిగి నష్టపోయాడు. ఈ ఏడాది కూడా అదే భూమిలో వరి సాగు చేశారు. పెట్టుబడి కోసం రూ.1.50లక్షలు అప్పు చేశాడు. బ్యాక్ వాటర్‌తో పంట మొత్తం నీట మునిగి నష్టం వాటిల్లింది. దీంతో రూ.6.50 లక్షల మేర అప్పు అయింది. అప్పు తీర్చే మార్గం లేకపోవడంతో గురువారం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య శంకరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అభినవ్ తెలిపారు.

ఉసురు తీసిన ఇసుక లారీ..

- బైక్‌ను ఢీకొన్న వాహనం
- అక్కడికక్కడే యువకుడి మృతి
- వెలిశాలలో ఘటన


కుమారస్వామి (ఫైల్)

టేకుమట్ల: ఇసుక లారీ ఓ యువకుడి ఉసురు తీసింది. ఈ ఘటన శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాలలో జరిగింది. గ్రామానికి చెందిన ఊర కుమారస్వామి(30) తన ద్విచక్ర వాహనంపై పంగిడిపల్లి వైపునకు వస్తున్నాడు. ఈ క్రమంలో బూర్నపల్లి ఇసుక క్వారీకి వెళ్తున్న లారీ.. వెలిశాల హైలెవల్ కల్వర్టుపై ఎదురుగా ఢీకొంది. దీంతో కుమారస్వామి అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గట్ల సుధాకర్ తెలిపారు. కాగా, పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ మృతుడి బంధువులు రోడ్డుపై ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు కాంగ్రెస్, బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం లేదన్నారు. ఫలితంగా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. మృతుడి కుటుంబానికి పరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజక వర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణ, బీజేపీ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు. చిట్యాల సీఐ వేణుచందర్, టేకుమట్ల, చిట్యాల, రేగొండ ఎస్సైలు సుధాకర్, షాఖాన్, శ్రీకాంత్‌రెడ్డి బందోబస్తు నిర్వహించారు.

ఎస్సైల దాతృత్వం..

మృతుడు కుమారస్వామి కుటుంబానికి చిట్యాల సీఐ వేణుచందర్, టేకుమట్ల, రేగొండ ఎస్సైలు సుధాకర్, శ్రీకాంత్‌రెడ్డి రూ.10వేల చొప్పున అందించి తమ దాతృత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

బాలుడిని బలితీసుకున్న నిద్ర..

- నానమ్మను చూసేందుకు వెళ్తూ అనంతలోకాలకు...
- కునుకు తీస్తూ ఆటో నుంచి జారి పడి చిన్నారి మృతి
- జనగామలో ఘటన


షరీఫ్ (ఫైల్)

జనగామ : అనారోగ్యంతో బాధపడుతున్న నానమ్మను చూసేందుకు తల్లిదండ్రులతో కలిసి ఆటోలో వెళ్తున్న ఓ బాలుడిని మృత్యువు.. నిద్ర రూపంలో కబలించింది. ఈ ఘటన శనివారం జిల్లా కేంద్రంలో జరిగింది. పాలకుర్తి మండలం మల్లంపల్లికి చెందిన ఇమామ్ పాషా, భార్య కర్మిషా బతుకుదెరువు నిమిత్తం ఘట్‌కేసర్‌కు వెళ్లారు. అక్కడే పాషా ఆటో నడిపించుకుంటూ.. కుమారుడు షరీఫ్(8), ఇద్దరు కూతుళ్లను పోషించుకుంటున్నాడు. రెండో శనివారం స్కూల్ లేకపోవడంతో తన తల్లి అనారోగ్యంగా ఉండడంతో భార్య, బిడ్డలతో కలిసి పాషా సొంత ఆటోలో బయలుదేరాడు. జనగామ పట్టణంలోని క్లాక్ కమాన్ వద్దకు రాగానే.. ముందు సీటులో ఉన్న బాలుడు షరీఫ్ కునుకు తీయడంతో ఆటో నుంచి కిందపడ్డాడు. తీవ్రగాయాలతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అటుగా వెళ్తున్న ఓ కారు ప్రయాణికులు.. బాబును వెంటనే జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. తీసుకొచ్చిన అరగంట లోపే బాలుడు మృతి చెందాడు.


ఆస్పత్రి ఆవరణలో రోదిస్తున్న బాలుడి తల్లి, కుటుంబ సభ్యులు

రోదనలతో మిన్నంటిన ఆస్పత్రి..

బాలుడి మృతితో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగారు. బాధితుల రోదనలతో ఆస్పత్రి ప్రాంగణం మిన్నంటింది. బాలుడు షరీఫ్ మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించగానే.. తల్లిదండ్రులు అక్కడే కుప్పకూలిపోయారు. మృతుడి ఇద్దరు చెల్లెళ్లు.. అన్నా మాట్లాడు అంటూ విగత జీవిగా ఉన్న తమ సోదరుడిని తట్టి లేపుతుంటే అక్కడే ఉన్న పేషెంట్లు, వైద్యులు కన్నీరు కార్చారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రయాణికులకు గుడ్‌న్యూస్..

- ఆర్టీసీ బస్సుల్లో జీపీఎస్ ట్రాకింగ్ ఏర్పాటు..
- ప్రారంభించిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్

హన్మకొండ: టీఎస్ ఆర్టీసీ.. ప్రయాణికుల ముంగిటకు మరో సాంకేతిక సహకారాన్ని తీసుకొచ్చింది. ఆర్టీసీ బస్సులకు సంబంధించిన సంపూర్ణ సహకారం అందించే 'గమ్యం వెహికిల్ ట్రాకింగ్' యాప్‌ను తీసుకొచ్చింది. ఈ యాప్‌ను శనివారం హైదరాబాద్ బస్ భవన్ నుంచి ఆర్టీసీ ఎండీ వి.సి.సజ్జనార్ ప్రారంభించారు. ప్రారంభోత్సవాన్ని ప్రయాణికులు వీక్షించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని బస్ స్టేషన్‌లో డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్ లగ్జరీ, ఏసీ బస్సులో జీపీఎస్ పరికరాలు బిగించారు. ప్రస్తుతం ఎక్స్‌ప్రెస్ ఆపై బస్సుల్లో మాత్రమే జీపీఎస్ సమాచారం అందుబాటులోకి వచ్చింది. త్వరలో పల్లె వెలుగు బస్సులకు కూడా ఈ సౌకర్యం విస్తరించేందుకు యాజమాన్యం ఏర్పాటు చేస్తోంది. 'గమ్యం వెహికిల్ ట్రాకింగ్ యాప్'ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి స్మార్ట్ ఫోన్‌లోకి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఈ యాప్ ద్వారా బస్సు ఎక్కడుందో తెలుసుకోవచ్చు. ఈ యాప్‌తో బస్సుల సమయం, ఏఏ బస్సులు ఏ సమయంలో అందుబాటులో ఉన్నాయో, బస్సు ఎక్కడికి వరకు వచ్చింది. బస్ స్టేషన్‌లు, బస్ స్టేజీల సమాచారం తెలుసుకోవచ్చు. ఈ యాప్ ప్రయాణికులకు ఎంతో దోహదపడుతుందని ఆర్టీసీ అధికారులు చెప్పారు.


హనుమకొండ బస్ స్టేషన్‌లో 'గమ్యం' యాప్ ఆవిష్కరణను వీక్షిస్తున్న ప్రయాణికులు

మహిళల రక్షణకు ప్రాధాన్యం..

మహిళల రక్షణకు యాప్‌లో ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. ప్రధానంగా హైదరాబాద్, సికింద్రాబాద్‌లో బస్ స్టేషన్‌లు, రూట్‌లు తెలియక చాలా మంది ఇబ్బందులు పడుతుంటారు. ఇలాంటి వారి కోసం గమ్యం యాప్‌లో 'ఫ్లాగే బస్సు' అనే ఆప్షన్ కూడా చేర్చారు. యాప్‌లోకి వెళ్లి ఫ్లాగే బస్ అనే చోట నొక్కితే (టచ్ చేస్తే) స్మార్ట్ ఫోన్‌లో ప్రత్యేక కలర్ వస్తుంది. ఈ కలర్‌తో ఉన్న స్మార్ట్ ఫోన్‌ను బస్సు ఎదుటగా చూపిస్తే డ్రైవర్ చూసి బస్సును నిలిపి మహిళలను ఎక్కించుకుంటారు. సమీపంలో ఉన్న బస్ స్టేజీలో దింపుతారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

ఆయిల్ మిల్లులో చోరీ

- రూ.లక్ష అపహరణ

ఖిలా వరంగల్ : వరంగల్ కరీమాబాద్ రోడ్డులోని హరికృష్ణ ట్రేడర్స్, సంధ్య ఆయిల్ మిల్లులో శుక్రవారం అర్ధరాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల కథనం ప్రకారం వరంగల్ రైల్వేగేట్ ప్రాంతం శాంతినగర్‌కు చెందిన వడ్డె లవన్‌కుమార్ కరీమాబాద్ రోడ్డులోని రామలక్ష్మణ్ గార్డెన్ ఎదుట లైన్‌లో హరికృష్ణ ట్రేడర్స్, సంధ్య ఆయిల్ మిల్లును ఏర్పాటు చేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోజు మాదిరిగానే రాత్రి 10గంటలకు మిల్లు ప్రధాన డోర్‌కు తాళం వేసి ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం గుమస్తాలతోపాటు మిల్లుకు చేరుకున్నాడు. గేట్ ప్రధాన ద్వారం డోర్లు ధ్వంసం చేసి క్యాష్ కౌంటర్ తాళాలు పగుల గొట్టి ఉన్నాయి. చోరీ జరిగిందని గ్రహించిన లవన్‌కుమార్ వెంటనే మిల్స్‌కాలనీ పోలీసులకు సమాచారం అందజేశారు. ఏసీపీ బోనాల కిషన్, ఎస్సై శ్రీలత, క్లూస్ టీమ్ హుటాహుటినా ఘటనా స్థలికి చేరుకున్నారు. ఈ ఘటనలో రూ.లక్ష చోరీ జరిగిందని బాధితుడు లవన్‌కుమార్ లబోదిబోమన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీలత తెలిపారు.


చోరీ జరిగిన తీరును పరిశీలిస్తున్న ఏసీపీ కిషన్

బిహార్ మహిళల హల్‌చల్..

- వాహనం ఆపి బలవంతంగా చందా వసూళ్లు
- ఇవ్వని వారికి బెదిరింపులు
- సాకరాశికుంట కట్టపై ఘటన

ఖిలా వరంగల్: వరంగల్‌లో బిహార్ మహిళలు హల్‌చల్ చేస్తున్నారు. చందాలపేరుతో వాహనదారుల నుంచి బలవంత వసూళ్లకు పాల్పడుతున్నారు. లేవంటే ఇక అంతే.. దూర్భాషలాడుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఈ ఘటన శనివారం ఉదయం వరంగల్ రైల్వేగేట్ ప్రాంతం సాకరాశికుంట కట్టపై జరిగింది. ఐదుగురు మహిళలు ఆటోలో కట్టపైకి చేరుకుని వాహనాలను ఆపి చందాపేరుతో నగదు వసూల్ చేశారు. ఇవ్వని వారిపై బెదిరింపుల పాల్పడ్డారు. స్థానికులు అక్కడి చేరుకుని ప్రశ్నించగానే వచ్చిన ఆటోలోనే వెళ్లిపోయారు. సదురు మహిళలు పంజాబీ, ఫ్యాంట్, షర్ట్ ధరించి ఉన్నారని, చేతిలో కర్రలు ఉన్నాయని స్థానికులు తెలిపారు. ఈ విషయం తెలిసిన వెంటనే మిల్స్‌కాలనీ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. పగలు రహదారులపై చందాలు అడగడం.. రాత్రి వేళల్లో తాళాలు వేసిన ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్నట్లు పలువురు తెలిపారు. వీరిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.


చందా అడుగుతున్న బిహార్ మహిళలు